

Mudra:B:GS:5374 TEL

# పరిష్కారం

'ద్వారక'

తూరుపు తెలతెలవారుతున్నది. పొగమంచు దట్టంగా వ్యాపించి ఉన్నది ఊరంత. వణుకు పుట్టిస్తున్నది వాతవరణం. సంక్రాంతి పర్వదినాలు.

చెవుల్ని కప్పేసేట్లుగా తలమీదికి చీర చెరుగు లాక్కొని రాములమ్మ ఇంటి ముందు కళ్ళాపి చల్లింది. అరుగుమీది నుంచి ముగ్గు బుట్ట అందుకొని చుక్కల ముగ్గు పెడుతూ కూచున్నది. ముగ్గు పెట్టడం మూడొంతులు పూర్తయింది. ఇంతలో తన వెనుక నుంచి ఎవరో కుమిలి కుమిలి ఏడుస్తున్న శబ్దం వినిపించింది. ముగ్గు వెయ్యడం ఆపేసి వెనక్కు తిరిగి చూసింది.

తన కూతురు లక్ష్మి చేతిలోని ముగ్గు బుట్టను దడాల్ని కింద పారేసి - "ఏమైందే అమ్మా! ఎందు కేడుస్తా వుండావే తల్లీ! ఈయాల్టప్పుడు ఎట్టా ఒచ్చావే అమ్మా!" అంటూ లక్ష్మిని వాటేసుకొని తనూ ఏడవటం ఆరంభించింది రాములమ్మ.

ఇద్దరూ శోకాలు బెట్టి ఏడుస్తున్నారు.

ఇంటి ముందునించి వినబడుతున్న ఏడుపు విని కప్పుకున్న బొంతను పక్కకు పారేసి దడాల్న లేచి కూచున్నాడు భూమయ్య. గబగబా బయటి కొచ్చి చూశాడు. తల్లీ కూతు ళ్ళిద్దరూ గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు పరిసరాలను మరిచిపోయి.

అత్తగా రింట్లో ఉన్న కూతురు లక్ష్మి ఇంత పొద్దున్నే ఇక్కడి కెందు కొచ్చిందో, ఆ ఏడు పెందుకో అర్థం కాలేదు భూమయ్యకు. తనకూ మనసులో భయం భయంగానే ఉన్నా గుండె దిటవు చేసుకొని - "పండగపూట ఇంటి ముంగల ఆ ఏడుపు లేంటీ? లోనికన్నా వొచ్చి యేడవండి" అంటూ గదమాయించాడు వాళ్ళను. వాళ్ళు ఎంతకూ కదలకపోయేసరికి, తనే ఇద్దర్నీ నెట్టుకుంటూ ఇంట్లోకి తీసుకుపోయాడు.

లక్ష్మి పెళ్ళయి నాలుగు నెలలు గూడా కాలేదు. కూతురితో బాటు తులం బంగారం, రిస్టు వాచీ ఇచ్చి ఉన్నంతలో ఘనంగానే చేశాడు పెళ్ళి. ఇంతలోకే కూతురు ఏడుస్తూ పుట్టింటికి తిరిగి రావటం ఆయన్ను కలచివేసింది.

అమ్మా, కూతురూ ఇంట్లోకి వచ్చింతరువాత "ఆ ఏడుపులు నిలిపి, అనలు యినయ మేంటో జెప్పండెహె!" అంటూ తెచ్చిపెట్టుకున్న కోపంతో గదమాయించాడు.

ఇద్దరూ ఏడుపు ఆపి భూమయ్య వంక దీనంగా చూశారు. ఇద్దరి కళ్ళూ జ్యోతుల్లా ఎర్రగా ఉన్నాయి.

"ఇంత పొద్దుటేల ఏందమ్మా ఇది?" అడిగింది రాములమ్మ కొద్దిగా స్తిమితపడి.

"నన్ను ఇంటోంచి తరిమేశా రమ్మా!" భోరు మన్నది లక్ష్మి.

నిలువు గుడ్లేశాడు భూమయ్య.

"ఎందుకు తరిమేశారే? యేం పోగాలం వొచ్చిందంట?" అన్నది రాములమ్మ రౌద్రాకారం దాల్చి.

"బాయిలోంచి నీళ్ళు తోడత తోడత కింద బడిపోనా నమ్మా. పడింతరువాత కాంసేపు తెలివిదప్పి పోనాది. దాంతో మా యత్త నాకు మూర్చరోగఁవఁని జెప్పింది. సెప్పా సెయ్యకుండా రోగిట్టిదాన్ని మా కంటగట్టినారని రాగాలు బెట్టి యేడిసింది. యీ యినయం కొడుక్కి, మొగుడికి జెప్పి నన్ను యింటోంచి ఎలగొట్టించిందే అమ్మా! కొడుక్కి మాఁరు మఁనుఁవుఁ జేత్తదంటనే అమ్మా!" అంటూ ఎక్కిళ్ళు బెట్టి ఏడవటం ప్రారంభించింది లక్ష్మి నట్టింట్లో కూలబడి.

"బంగార వఁంటి నా బిడ్డ రోగిట్టా? ఎవుడే దాఁనికి జెప్పింది? మారుమఁనుఁవుఁ జేత్త దంటనా? ఎట్టా జేత్తుందో నేనూ జూత్త" అంటూ కారాలు, మిరియాలు నూరాడు భూమయ్య.

తల్లిదండ్రు లిద్దరూ కూతురికి ధైర్యం జెప్పి ఓదార్చారు.

కూతురి చేత ముఖం కడిగించి చద్దన్నం తినిపించింది రాములమ్మ. భూమయ్య ఉట్టి కడుపుతోటే ఊరి పెద్ద దగ్గరికి పోయాడు.

రాములమ్మ బెల్లం పరమాన్నం వండి ఆప్యాయంగా కూతురికి పెట్టి తినిపించింది.

భూమయ్యకు నలుగురు కొడుకులు. కూతురు మాత్రం ఒకటే లక్ష్మి.

పెళ్ళిళ్ళయిం తరువాత కొడుకులు పెళ్ళాల్తో వేరు కాపురాలు చేస్తున్నారు. తోడికోడళ్ళ మధ్య, అన్నదమ్ముల మధ్య అనవసర కలతలకు, కలహాలకు అవకాశం లేకుండా భూమయ్యే ఈ ఏర్పాటు చేశాడు. భూమయ్య ఆశల కనుగుణంగా అన్నదమ్ములు నలుగురూ సఖ్యతగానే ఉంటున్నారు. తల్లిదండ్రు లంటే ప్రేమాభిమానా లున్నాయి. చెల్లెలంటే అందరికీ ప్రేమే. లక్ష్మికి ఇలా జరిగినందుకు అందరూ బాధపడుతున్నారు. అన్నలు, వదినలు లక్ష్మిని అక్కున జేర్చుకొని ఓదార్చారు. ధైర్యం చెప్పారు.

భూమయ్య ఊరి పెద్ద ఇంటినుంచి ఆలస్యంగా ఇంటి కొచ్చాడు. కొడుకులను, కూతుర్ని ఎదురుగా కూచోబెట్టుకొని చెప్పాల్సిందంత చెప్పాడు. ఆ సాయంత్రమే నలుగురు కొడుకులను, కూతుర్ని, మరో నలుగురు ఇరుగు పొరుగు వారిని వెంట దీసుకొని లక్ష్మి అత్తగారి ఊరికి బయలుదేరి పోయాడు. ఆ ఊరికీ, ఈ ఊరికీ మధ్య దూరం నాలుగు కిలోమీటర్లకు మించి లేదు.

వీళ్ళు పోయేసరికి ఇంట్లో దీపం పెట్టి అత్త ఎంకటమ్మ వీధి గుమ్మంలో కూచొని ఉన్నది. వాకిలికి రెండు పక్కలా ఉన్న అరుగుల మీద తండ్రీ, కొడుకులు కూచొని మాట్లాడుకుంటున్నారు. తమ ఇంటి ముందు లక్ష్మితో సహా ఇంతమంది మనుషుల్ని చూచి గతుక్కు మన్నారు ముగ్గురూ.

ఎంకటమ్మ చిదరించుకుంటూ ఒక్క విసుర్న లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"పోమ్మా! ఇంటోకి పో. నీ యింటోకి ఎల్లేందుకు నీకు బయమెందు కమ్మా! మాలచ్చిలా పోమ్మా!" అన్నాడు భూమయ్య కూతురు వెన్ను దట్టి. అల్లుడితో గాని, వియ్యంకుడితో గాని ఒక్క మాట గూడా మాట్లాడలేదు భూమయ్య.

లక్ష్మి ధైర్యంగా అడుగులు వేస్తూ ఇంట్లోకి వెళ్ళింది.

అనుకోని ఈ పరిణామానికి నిలువు గుడ్లు పడ్డాయి తండ్రీ కొడుకులకు. చూస్తూ ఉండిపోయారు.

భూమయ్య, మిగిలిన వాళ్ళు ఇంటి ముందు ముగ్గులో కూచునేశారు నిశ్శబ్దంగా. ఇంటి లోపల్నించి ఎటువంటి శబ్దాలూ వినిపించలేదు. అరుగులమీద కూచున్న ఇద్దరూ గూడా ఇంట్లోకి పోయారు. భూమయ్య చిన్న కొడుకు తలుపు దగ్గరికి పోయి అడ్డంగా కూచున్నాడు.

ముగ్గులో కూచున్న మనుషులు రాత్రంత లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ ఉన్నారు. ఇంట్లోనించి అరుపులు, కేకలు ఏమీ వినరాకపోవడంతో తెల్లవారుజాము మూడు నాలుగు గంటల మధ్యలో ఒక్క కునుకు దీశా రందరూ. ఆ చలిలో ఉండ చుట్టుకొని పడి ఉన్నా రందరూ.

మెలకువ వచ్చి చూసేసరికి తలుపుకు తాళం కప్ప వేలాడుతున్నది. లక్ష్మి గడపలో తలుపు నానుకొని నిద్రబోతున్నది. అరుగుల మీద తండ్రీ, కొడుకులు బొంతలో దూరి నిద్రబోతున్నారు.

ముగ్గులో కూచున్న అందరూ మేలుకున్నారు. ఒళ్ళు మండింది భూమయ్యకు. కూతుర్ని లేపాడు.

"మీ యత్తను లోపలెట్టి బీగవేశారా యేందే! ను వ్వేంది యీడ బడున్నావు? ఇంటోంచి బైటికి రావొద్దన్నెవ్రులా?" అన్నాడు కూతురితో.

"అత్త రే పొత్త నన్జెప్పి కూతు రింటి కెళ్ళింది నాయనా. నన్ను బైట కూకోబెట్టి బీగ వేశారు. అరిత్తే గొంతు బిసికేత్త మన్నారు నాయనా!" కన్నీళ్ళు కారుస్తూ అన్నది లక్ష్మి.

"ఏడుపుల్తో పన్లు జరగవు లచ్మీ! ధైర్నంగుండు. అన్ని లేవు. నీ మొగుణ్ని లేపి బీగం చెయి యిమ్మను. ఈకబోతే బీగం పగలగొట్టా నన్జెప్పు. లేపు. లే పాడ్ని" అన్నాడు భూమయ్య.

"యేంయో! బీగం సెయి యియ్యి" అంటూ మొగుడిని తట్టి లేపింది లక్ష్మి.

"పోయే రోగిట్టిదానా! మీ అయ్య ఇంటి కెళ్ళు. చెప్పా సెయ్యకుండ రోగిట్టి దా న్నంటగట్టారు. నే నీనుబో" అంటూ మరో పక్కకు తిరిగా డతను.

"బీగం సెయి యిమ్మంటే కతలు జెబుత వేంది? ఇత్త వా? బీగం పగలగొట్టమంటావా?" గద్దించి అడిగింది లక్ష్మి.

ఈలోగా భూమయ్య కొడుకుల్లో ఒకడు ఒక పెద్ద రాతిని తీసుకొచ్చి లక్ష్మి చేతిలో పెట్టాడు.

"ఇదుగో రాయి. బీగం బగలగొడత వుండా. బీగం సెయి యిత్త వా, యివా?"



Mudra: B: G: 5375: TEL

"నా పానానికి దాపరించావు గందే రోగిష్టిదానా! ఇంద సావు. నువ్వుంటే నే నీ యింటో వుండ్ను. నేనే ఎటో ఎల్లిబోత" అంటూ తాళం చెవి విసురుగా అరుగుమీద వేశాడు.

"నువ్వు ఎటైనా బో. నాకేం. ఈ ఇల్లు నాది. నేను దీంటోనే వుంటా. ఇందులో యన్నీ నాయే" అంటూ తలుపు దీసి లోపలి కెళ్ళింది లక్ష్మి.

"ఇల్లు, ఇంటో వుండేయి నీ వెట్టా గవుతయ్యే! అయన్నీ నా నవారిజితం. నీకేం అక్కు లేదు" అంటూ లేచాడు మామ.

"నీ నవారిజితమైనా నీ తరవాత అన్నీ నీ కొడుకే గద మాఁవాఁ దక్కేది?" అన్నాడు భూమయ్య కొడుకుల్లో ఒకడు నవ్వుతూ.

"నే నింకా వుండగా వాడి దెట్టా గవుద్ది? నా ఇల్లు నా యిష్టం. రాయే బైటికి!" లోపలికి పోబోయాడు మామ.

"ఎల్లిపోవాలనుంటే సెప్పు మాఁవాఁ! అదెంత పని? ఎంటనే సేసేత్తాం" అన్నాడు మరో కొడుకు పగలబడి నవ్వుతూ.

పెద్దాయన అరుగుమీద కూలబడ్డాడు.

"నిన్న సాయంతరం నుంచీ వొట్టి కడుపుల్తో బడి వున్నాం. కాత్త అన్నవేఁ, నంగటో వొండు లచ్మమ్మా!" అన్నారు గుంపులోంచి ఒకరు ఇంట్లోకి తొంగిచూస్తూ.

"ఈడ అన్నాలు, గిన్నాలు యేం కుదర్దు... నువ్వు ఇంటో బియ్యం. బేడలు యేవీఁ ముట్టుకునేందు కీల్లేదే."

అపాటికే లక్ష్మి బియ్యం నీళ్ళలో పోసి కడుగుతున్నాది. అతను బలవంతాన గిన్నె ఆమె చేతుల్లోంచి లాక్కొని నీళ్ళు పారబోసి తడి బియ్యం చేటలో పోశాడు. లక్ష్మి బియ్యం చేటను లాక్కోబోయింది. కొట్టేందుకు చెయ్యెత్తాడు భర్త.

తల పైకెత్తి చూచింది లక్ష్మి కనుగుడ్లు పెద్దవి జేసి. "కొడతావా? కొట్టు. అయిదు దెబ్బల దాకా నువ్వు కొట్టొచ్చు. ఆరో దెబ్బ మాత్రం నాది నీకు తగులుద్ది. అది యిష్టమైతే చెయి జేసుకో" అన్నాది పమిటచెరుగుతో నడుము బిగించుకుంటూ.

"నన్నే కొడతావంటే రోగిష్టిదానా! మా యమ్మ యాడి కెళ్లిందో దెల్సా? ఇంకో పిల్లను మాట్లాడుకో నొచ్చేందుకేనే రోగిష్టిదానా. నేను మారు మనువు జేసుకుంటే గాని నీకు, నీ అయ్యకు పొగ రనగదే" అన్నాడు చెయ్యి కిందికి దించి.

"బెదిరిత్త వుండావా? నీ బెదిరింపులకు బయపడే దాన్నేం గాదు. ఆడ జూశావుగా. మా అయ్య, అన్నలు నన్ను పూలల్లో బెట్టి సూసుకునేవోల్లు. నీకు తులరి బంగారు, రిట్టువోసీతో నగా కట్టబెట్టారు గదయ్యా. కుసింత కళ్లు దిరిగి కింద బడితే మూర్చరోగమని ఇంటోంచి తరిమేత్తరా? మీ యమ్మ మరో పెళ్ళికూతుర్ని తీసకరాబోయిందా! సేస్కో, సేస్కో. మారు మనువే జేసుకో. ఈ ఇంట్లో నా సేతలమీదిగా నే జరిపిత్తాలే పెల్లి."

"ఇది నా యిల్లే. నా నవారిజితం. నేను శవఁటోడిసి కట్టించుకొన్నాదే. ఈడ నీ పెత్తనం వేందే? రా బేటికి" అంటూ లోపలికి దూరాడు మామ.

భూమయ్య ఆయన కొడుకులతోబాటు చోద్యం చూసేందుకు ఊరి ఆడ, మగ-ఇరుగుపొరుగు జనం కూడా చేరా రక్కడ. అందరూ లోపల జరుగుతున్నదంత చూస్తూ నుంచున్నారు.

"నా సెయ్ ముట్టుకోమాక మాఁవాఁ! ముట్టుకున్నావో నీ నవార్జితం నీ కొడు క్కయిపోద్ది. ఆ తరువాత నా దవుద్ది. బేట మణుసుల్ని జూశావుగా. జాగరత!" గద్దించింది లక్ష్మి.

కోపం దిగమింగుకుని కొడుకు ముఖంలోకి చూస్తూ నుంచుండిపోయా డతను.

"కొత్త పెల్లి కూతు రొచ్చేలోగా మావిఁడాకుల తోరనాలు కట్టించేదా మొగుడా? పెల్లి జూసేందుకు మా అయ్య, అన్నలు, ఇరుగు పొరుగోల్లు శానా మంది వున్నారు. బాజా బజింతిరీలు గూడా బాగుంటాయి" అన్నాది లక్ష్మి నవ్వుతూ.

"ఎగిరి పడమాకే రోగిష్టిదానా! మా యమ్మ వొత్తా వుంట దిలే. నీ అయ్య. అన్నలు యేం జేత్త రో జూత్త."

"నీ సేత్తో వొండిన అన్నం నేను దిన్ను. నీ రోగం నా క్కూడా వొత్తది." ధుమధుమలాడుతూ అన్నాడు మొగుడు.

"నువ్వు దినమాక. పెల్లి జేసుకున్న తరవాత తిందువుగాన్లే. మీ అయ్య గ్గూడా వొద్దులే. ఇది మా అయ్యకు, అన్నలకు. మిగిలింది యేమైనా వుంటే నువ్వు, నీ యయ్య తినండి. లేకపోతే కుక్కల కేసేత్త. నా కేం. నువ్వు కొత్త పెల్లి కూతురు సేతొంటే తిందూగాన్లే."

"ఏందే లచ్మీ! నీ మొగుడు మారు మనువుఁ జేసుకుంటా డంటనా?" అంటూ పొరుగింటి పుల్లమ్మ ముక్కు మీద వేలేసుకుని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ ఇంట్లో కొచ్చింది. ఆమెతోపాటే మరి కొందరు ఆడవాళ్ళూ, మగవాళ్ళూ ఇంట్లోకి జొరబడ్డారు.

"యేం? జేసుకుంటాను. ఈ రోగిష్టి దాంతో ఎవుడు కాపరం జేత్త డంట? మా యమ్మ కాసారం బోయింది అందుకే." చేతు లూపుతూ ఆవేశంగా అన్నాడు మొగుడు.

"ఒరే ఎర్రి మొగవాఁ! నువ్వు. నీ యమ్మ ఇంకా పాతకాలంలోనే వున్నారంట్రా!" అన్నాది పుల్లమ్మ.

"నీ యింటి పక్కనే. నీతోబాటే వుంటావుండా పుల్ల మ్మత్త! నువ్వు కొత్తకాలంలో వుంటున్నావా?" అన్నాడు అతను.

"మీ రందరూ నా ఇంటో కెందుకు దూరారూ? ఎవుడు రమ్మన్నా డంట!" దూకుడుగా అన్నాడు మామ.

"యిల్లు బజారు జేసుకున్నాంక ఒకరు రమ్మనే పనేఁవుంది మాఁవాఁ! మాకు మేఁవేఁ వొచ్చినం!" అన్నాది సుబ్బమ్మ.

"నా పెల్లాం. నా యిష్టం వొచ్చినట్టు జేసుకుంట. అడిగేందుకు మీ రెవురంట?" ఉగ్రుడైనాడు మొగుడు.

"అది నీ పెల్లావేఁ గాదురా! మరో ఆడమడీసి. దాని ఒంటో నలతగా వుంటే డాకటరుకు జూపించి మం దిప్పించక మూర్చ రోగమని ఎట్టా పేరు బెట్టుద్దిరా మీ యమ్మ? నువ్వు దాని మాట లిని కట్టుకున్న దాన్ని ఇంటోంచి ఎలగొడతా వంటరా? మారు మనువుఁ జేసుకుంటా నని మునువుఁన బడతావా! కాలం మారిపోయిందిరా ఎర్రి మొగవాఁ!"

నాలుగు పక్కలా నలుగురూ నోరు జేసుకునేసరికి గుక్క తిప్పుకోలేకపోయారు మొగుడు. మామ.

"మారు మనువుఁ జేసుకునోల్లకు సొబనం పోలీసులే జరిపిత్తరంటలే అత్త! మా వూరి పెద్దాయన జెప్పాడులే. జేసుకోనీ. ఆ పిల్లను. వాల్ల అమ్మా నాయన్నూ. ఈన్ను. యీల్ల అమ్మా నాయన్ను గూడా కొట్లోయేసేత్త రంట. అందరూ కొట్లో బోయి కూకుంటే ఈ యి ల్లేమవుద్ది! ఎవురైనా సూసుకోవొద్దూ. ఇదంత నాకే అవుద్దంట. ఆయిగా తినుకుంటా వుంటా. రొండేల్లు బోయినాక నేనూ మారు మనువు జేసుకొని అత్తితోనగా ఆయిగా వుండొచ్చునంట. ఆయన జెప్పిండు. నా కేం బయం లే దత్త! మీ రంతా ఎల్లిపొం డత్త! ఆకలేత్త వుంది. వొండుకొని దినాల" అంటూ అందర్నీ బయటికి తోసుకొచ్చింది లక్ష్మి.

భూమయ్య, ఆయన కొడుకులు సంతోషంగా నవ్వుకుంటున్నారు.

"అయినా మీ యమ్మకు అ దేం రోగంరా! పిల్ల యేదో తెలివితప్పి పడిపోయిం దని మూర్చరోగం మని పేరుబెట్టి తరిమెయ్యకబోతే, డాకటరుకు సూపించమనగూడదా. మం దిప్పించమనగూడదా? మనకి మందెట్టి బంగారవంటి పిల్లను తరిమేపించింది. అ దేం ఆడదిరా! తోటి ఆడదాని కష్టం తెలుసుకోని ఆడది ఆడది గాదురా - గొడ్డు. దాని మాట లినోల్లం మన వేఁం మొగోల్లంరా!" అన్నాడు మామ లక్ష్మి తల నిమురుతూ. అస్తంత పోతుందని భయపడ్డా డతను. ప్లేటు మార్చేశాడు.

"నేను యదవనులే నాయనా! అమ్మ మాట లిని కట్టుకున్న దానికి అన్నేయం జెయ్యా లనుకున్నాను. సరేలే. ను వ్వన్నం వొండు లచ్మీ! ఆక లవుతా వుంది" అన్నాడు మొగుడు తండ్రికి వంతపాడుతూ.

"లచ్చిమి తల్లీ! మేం ఇంటి కెల్తావఁమ్మా! యీల్లు మల్లా కిరికిర్లు జేత్తే కాకితో కబు రంపించు. దోవలో పోలీసోల్లకు జెప్పి వొచ్చాంలే" అంటూ కొడుకుల్ని వెంట తీసుకుని బయలుదేరాడు భూమయ్య.

అల్లుడు వాళ్ళకు అడ్డం పడ్డాడు - "అన్నం దినకుండా ఎల్లిపోగూడదు మాఁవాఁ! నాకు బుద్దొచ్చిందిగా. లచ్మిని పానంలో పేనంగా జూసుకుంటాగా. నా మాట నమ్ము మాఁవాఁ!" అంటూ బ్రతిమాలాడు.

భూమయ్య సంతోషంతో సపరివారంగా ఆ పూట కక్కడ నిలిచిపోయాడు. ★